ఉచిత ఆరోగ్య కేంద్రం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నాదెళ్ళ లక్ష్మయ్య మెమోరియల్ ఆరోగ్యం కేంద్రం ఉంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. అవుట్ పేషంట్‌కు రూ.30లు చెల్లించాలి. ప్రతి రోజు సుమారు 25 మంది రోగులకు వైద్య పరీక్షలు అందిస్తారు. వైద్య పరీక్షలు చేసిన వారికి ఉచితంగా మందులు, మైనర్ ఆపరేషన్లు కూడా ఆరోగ్యం కేంద్రంలో నిర్వహిస్తారు. ఆరోగ్య కేంద్రానికి సికింద్రాబాద్, మసీద్‌బండ, కొండాపూర్, మార్తాండనగర్, సుభాష్‌చంద్రబోస్‌నగర్, ప్రేమ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆదివారం ఆరోగ్య కేంద్రానికి సెలవు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. 'ఆధ్యాత్మికత' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్రియేటివ్ యాక్టివిటీస్, గేమ్స్, ఫన్, లెర్నింగ్, మెడిటేషన్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234 లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

10 మంచినీటి కేంద్రాలు ఏర్పాటు చేశాం

రాజేంద్రనగర్: జలమండలి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 10 ఉచిత మంచినీటి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు రాజేంద్రనగర్ బుద్వేల్ సెక్షన్ జలమండలి మేనేజర్ రామ్ నర్సింహారెడ్డి తెలిపారు. గురువారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రయాణికులు, విద్యార్థులు ప్రజల సౌకర్యార్థం తాగునీరు అందించాలనే ఉద్దేశంతోనే అత్తాపూర్, హైదర్‌గూడ, ఆరాంఘర్, ఉప్పర్‌పల్లి బస్టాండ్లతో పాటు సులేమాన్‌నగర్, పీడీపీ చౌరస్తాల్లో వీటిని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి సెంటర్ వద్ద చల్లటి తాగునీరు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

అలరించిన బాలనాగమ్మ పద్యనాటకం

ఫిలింనగర్: ఉగాది పద్య నాటకోత్సవాల్లో భాగంగా పొత్తూరు వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటికలు ఆకట్టుకుంటున్నాయి. ఫిలిం ఛాంబర్ ఆవరణలోని రామానాయుడు కళామండపంలో గురువారం బాల నాగమ్మ పద్యనాటకాన్ని నవక్రాంతి కల్చరల్ అసోసియేషన్ రంగస్థల నటులు ప్రదర్శించారు. రెండున్నర గంటల పాటు సాగిన ఈ నాటకాన్ని కళాకారులు రక్తికట్టించారు. శ్రీకృష్ణుడిగా గాన విశారద షణ్ముఖి విజయకుమార రాజు, అర్జునుడిగా గాన విరాట్ కె. కృష్ణ చైతన్య నటించగా కార్యవర్ధిగా విక్టరి మరియాదాస్, మాయలఫకీర్‌గా ఎం.అర్జున రావు, బాలవర్ధిగా బి. నారాయణస్వామి, పులిరాజుగా పి.ఆంజనేయులు, బసవేశ్వరుడిగా డి.జయరాం, తిప్పడుగా ఎస్.గురునాథాచారి, కాపాలిగా నాగరాజ్, బాల నాగమ్మగా నాట్యమయూరి ఎస్. తిరుమలాబి, సంగుగా రత్నశ్రీ, లచ్చిగా మనుప్రియ నటించారు. వీరికి సంగీతం కె. సత్తిబాబు, డోలక్ వీర్రాజు సహకారం అందించారు. వీనుల విందుగా సాగిన ఈ నాటకాన్ని సినీ ప్రేక్షకులు, కళాభిమానులు వీక్షించి పరవశించిపోయారు. నేటి సమాజంలో పద్యనాటకాలు, స్టేజీ నాటకాలు కనుమరుగవుతున్న తరుణంలో నేటితరం కళాకారులకు, సినీ ప్రేక్షకులకు పద్యనాటకాల గురించి తెలియజేసేందుకే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పొత్తూరు వెంకట సుబ్బారావు తెలిపారు.

మోదీతోనే మహిళా సాధికారత సాధ్యం

అపోలో గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ జేఎండీ కొండా సంగీతారెడ్డి



టెలికామ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న సంగీతారెడ్డి, నాయకులు

గచ్చిబౌలి: మహిళలంతా బీజేపీ వెంటేనని, ప్రధాని మోదీతోనే మహిళా సాధికారత సాధ్యమని అపోలో గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ జేఎండీ కొండా సంగీతారెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని టెలికామ్‌నగర్‌లో గురువారం రాత్రి ఆమె ప్రచారం చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ సర్కారు మహిళల అభివృద్ధికి ఎన్నో పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. ముఖ్యంగా ముద్రా, పీఎం విశ్వకర్మ పథకాల ద్వారా చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలకు నరేంద్ర మోడీ ఆర్థిక చేయూత అందించారన్నారు. ఇక స్టార్టప్ ఇండియా మహిళా పారిశ్రామిక వేత్తలకు భరోసా కల్పించారన్నారు. నరేంద్ర మోడీ సాహోసోపేత నిర్ణయాలతో ఇవాళ భారతదేశం ప్రపంచంలో అయిదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిందన్నారు. మరోసారి ప్రజలంతా మోడీ సర్కార్ ఏర్పాటుకు కృషి చేయాలని, అందులో భాగంగా చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఆమె కోరారు. ప్రచార ప్రారంభంలో బెలూన్లను ఎగురవేశారు. అంతకుముందు బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వందలాది మంది మహిళలతో పాటు బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనువిందు.. కూచిపూడి నృత్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో గురువారం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన ప్రముఖ భరతనాట్య కళాకారిణి భావన వెంకటేశ్వర కుమార్తె ధన్యశ్రీ భరతనాట్య ప్రదర్శనతో అలరించింది. ఇందులో పుష్పాంజలి, గణేశకృతి, త్రినాథకౌతం, శృంగారపురదీశ్వరి, తిల్లాన అంశాలను ప్రదర్శించింది. అమృత ఆర్ట్స్ అకాడమీ గురువు సాయిగీత శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. బ్రహ్మాంజలి, మూషికవాహన, నర్తనం గణపతిం, రామాయణశబ్దం, కృష్ణశబ్దం, బాలగోపాల తరంగం, తిల్లాన అంశాలను వార్షిత, వినోద, సంహిత, జాహ్నవి, లక్ష్మి, నందిని, కాత్యాయిని, రోహిని, దీక్ష, సహస్ర, శ్రీజ, తేజ, తుషార ప్రదర్శించారు.

చలివేంద్రం ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : రామచంద్రాపురం పట్టణంలోని అశోక్‌నగర్‌లో రామచంద్రాపురం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం జిల్లాబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రామరావు దేశ్‌పాండే ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు శేషాద్రి పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు



అల్లాపూర్‌లో ముస్లింలతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్ష నాయకులు ప్రార్థనల్లో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. – కూకట్‌పల్లి జోన్ బృందం



ఎల్లమ్మబండ ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఆల్విన్ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు



చున్నూ పాషాను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన వడ్డేపల్లి రాజేశ్వరరావు



కార్పొరేటర్ సబిహా బేగం దంపతులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్



పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ జాహిద్ షరీఫ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న స్థానికులు







నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ముస్లింలు



హైదర్‌నగర్‌లోని ఈద్గాలో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి

రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్



బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలిపించాలని నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రవికుమార్ యాదవ్, బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సంఘ సంస్కర్త, మహనీయుడు జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా రిక్షాపుల్లర్స్ కాలనీలో పూలే విగ్రహానికి బీజేపీ పార్టీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించి జ్యోతిరావు పూలే కలలుగన్న సామాజిక న్యాయం బీజేపీ పార్టీ నరేంద్ర మోదీ నాయకత్వంలోనే సాధ్యమవుతుందని తెలిపారు. గురువారం చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో రవి కుమార్ యాదవ్‌మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు, బీసీలకు అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం, చట్ట సభల్లో ప్రాధాన్యత కల్పించటం బీజేపీ సిద్ధాంతమన్నారు. దేశం త్వరగా అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో, దేశంలో బీజేపీ అధికారంలో ఉండాలని పేర్కొన్నారు.

➡ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారంటే కేవలం ఆయన దేశం కోసం తీసుకున్న కీలక నిర్ణయాలే అని తెలిపారు. వివేకానందనగర్ డివిజన్‌కు సంబంధించిన వెంకటేశ్వరనగర్, మాదవరం కాలనీ, కమలప్రసన్న నగర్, వివేకానందనగర్, సుమిత్ర నగర్, బాగ్‌మీర్ కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేస్తూ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నర్సింగ్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కన్వీనర్ రాఘవేంద్రరావు, కార్యవర్గ సభ్యులు రవీంద్రరావు, డాక్టర్ నరేష్, కో-కన్వెన్షన్ కన్వీనర్ మణిభూషణ్, కేశవ్, నర్సింగ్ యాదవ్, చారి తదితరులు పాల్గొన్నారు.

లోహంతో ముడిపడిన ప్రపంచ చరిత్ర

ముగిసిన దక్షిణ భారత న్యూమిస్మాటిక్స్ సొసైటీ సదస్సు

బంజారాహిల్స్: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ చరిత్ర విభాగం, సౌత్ ఇండియన్ న్యూమిస్మాటిక్స్ సొసైటీ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా 'న్యూమిస్మాటిక్స్-దక్షిణ భారత చరిత్ర-పునర్నిర్మాణం' అంశంపై రెండు రోజుల పాటు జరిగిన దక్షిణ భారత న్యూమిస్మాటిక్స్ సొసైటీ 32వ వార్షిక సదస్సు గురువారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ కె.సీతారామారావు హాజరై ప్రసంగించారు. ప్రపంచ చరిత్ర లోహంతోనే ముడిపడి ఉందని, లోహంతో తయారయ్యే నాణేలు మాత్రమే ఆయా ప్రాంత, దేశ చరిత్రను బహిర్గతపరుస్తాయని వివరించారు. యువ పరిశోధకులు ఈ అంశాలపై దృష్టిపెడితే చరిత్రకు సంబంధించిన మరిన్ని చారిత్రాక అంశాలు వెలుగులోకి వస్తాయన్నారు. సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధారాణి మాట్లాడుతూ... రెండు రోజుల పాటు అనేక చారిత్రక ఆనవాళ్లు, విభిన్నమైన నాణేలు, వాటిపై పరిశోధనలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు వివరించారు. సౌత్ ఇండియన్ న్యూమిస్మాటిక్స్ సొసైటీ అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ... సొసైటీని మరింత పటిష్టపరిచి దేశ చరిత్రను అధ్యయనం చేయడానికి దోహదపడనున్నట్లు వెల్లడించారు. డీన్ ప్రొఫెసర్ వడ్లాణం శ్రీనివాస్ రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సులో సెషన్స్ వారీగా కార్యక్రమ వివరాలతో కూడిన నివేదికను సదస్సులో సమర్పించారు. ఏఎస్ఐ (కేరళ) డైరెక్టర్ డాక్టర్ సత్యమూర్తి ముగింపు సదస్సులో కీలకోపన్యాసం చేశారు.

సంఘ సేవకులకు సత్కారం

ఫిలింనగర్: బడుగుల ఆశాజ్యోతి మహాత్మాజ్యోతిరావు పూలే 198వ జయంత్యోత్సవాల సందర్భంగా ఖైరాబాద్‌లోని విశ్వేశ్వర్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘ సేవకులు, కళాకారులను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఘనంగా సత్కరించారు. ఫిలింనగర్‌లోని గౌతంనగర్ బస్తీకి చెందిన సంఘ సేవకులు గుంటి నరేష్‌సాగర్, దిండి వెంకటస్వామి సాగర్‌లను ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే నిర్వాహక కమిటీ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసింది.

బెల్ట్ షాపుపై దాడి

రహమత్‌నగర్: అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న ఓ వ్యక్తి ఇంటిపై దాడి చేసి నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను బోరబండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు... పెద్దమ్మనగర్‌కు చెందిన బాబు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఉదయం అతని ఇంటిపై దాడి చేశారు. ఈ సందర్భంగా 41 మద్యం బాటిళ్లు (90ఎంఎల్) స్వాధీనం చేసుకున్నారు.



ప్రజా పాలనకు నిదర్శనం కాంగ్రెస్ ప్రభుత్వం

చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



డివిజన్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

భాగ్యనగర్‌కాలనీ: ప్రజా పాలనకు నిదర్శనం కాంగ్రెస్ ప్రభుత్వమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతున్నామని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. గురవారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌రెడ్డితో కలిసి పాల్గొన్న రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకునే బాధ్యత తనదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తన గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్, మాజీ కార్పొరేటర్లు జానకీరామరాజు, భానుప్రసాద్, శేరిలింగంపల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, నాయకులు రఘునాద్ యాదవ్, మైపాల్ యాదవ్, సంజీవరెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, బాషిపాక నాగమణి, విద్యాకల్పన ఏకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: శ్రావణి ఆస్పత్రి ఆధ్వర్యంలో తులసీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ శనివారం తులసీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. యూరాలజీ వైద్యులు డా. పాల్ నవీన్ గైనకాలజిస్ట్ వైద్య చికిత్స అందించనున్నారు. మరిన్ని వివరాలకు 9908774837 నెంబర్లో సంప్రదించగలరు.

కూరగాయల సంత

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌లో ప్రతి శుక్రవారం వారాంతపు కూరగాయల సంత కొనసాగుతుంది. ఈ సంతలో తాజా కూరగాయలు, పండ్లు, పూలు, నిత్యావసరాలు, గృహోపకరణాలు అందుబాటులో ఉంటాయి.

మల్లికార్జున స్వామి జాతర

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఇమాంనగర్ గ్రామంలో గురువారం మల్లికార్జునస్వామి జాతర నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్‌తో పాటు స్థానిక నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిబా పూలే జయంతి

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే జయంతి గురువారం కూకట్‌పల్లి జోన్ వ్యాప్తంగా ఘనంగా జరిగింది. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్‌లు, పలు పార్టీల నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... మహాత్మా జ్యోతిరావు బాపులే చేసిన సేవలు అమోఘమన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనే పూలేకు అసలైన నివాళి అని పేర్కొన్నారు. మహిళలకు విద్య అవసరమని చెప్పి తన భార్యకి మొదటగా చదువు నేర్పించారని గుర్తు చేశారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసి వారి గుండెల్లో మహాత్మాగా చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. – కూకట్‌పల్లి జోన్ బృందం



జ్యోతిబా పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి



జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, నాయకులు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకుడు బాషిపాక యాదగిరి, నాయకులు



బాలానగర్ కాంగ్రెస్ కార్యాలయంలో పూలే జయంతి వేడుకల్లో బండి రమేష్, కార్యకర్తలు



శ్రీశ్రీనగర్‌లో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు